క్లుప్తంగా

సబ్‌జైలు ఆకస్మిక తనిఖీ



రికార్డులను పరిశీలిస్తున్న జడ్జి వాసు

నంద్యాల(వ్యవసాయం): నంద్యాల సబ్ జైలును మూడవ అదనపు జిల్లా జడ్జి వాసు శనివారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. జైలు ఆవరణ, ఖైదీల గదులను పరిశీలించి వారి బాగోగులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఖైదీల హాజరు పట్టికను పరిశీలించి ఆరోగ్యం, తదితర విషయాలను అడిగి తెలుసుకున్నారు. ఆయన మాట్లాడుతూ ఖైదీలపై ఆధారపడిన కుటుంబాన్ని దృష్టిలో ఉంచుకొని సత్ప్రవర్తనతో మెలగాలని సూచించారు. జైలు సూపరింటెండెంట్ రామచంద్రారెడ్డి, జైలు సిబ్బంది పాల్గొన్నారు.

ఆలయాల్లో ప్రత్యేక పూజలు



సుద్దమల్లలో భక్తులకు హారతిస్తున్న అర్చకులు

ఉయ్యాలవాడ: మండలంలోని సుద్దమల్ల, ఆర్.జంబులదిన్నె, ఉయ్యాలవాడ, ఇంజేడు గ్రామాల్లో వెలిసిన ఆలయాల్లో శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. లక్ష్మీనరసింహ కంబగిరిస్వామి, అభయాంజనేయస్వామి, లక్ష్మీవేంకటేశ్వరస్వామి ఆలయాల్లో భక్తులు వేకువజామునే ప్రత్యేక అభిషేకాలు, కుంకుమార్చన, ఆకుపూజ నిర్వహించి మొక్కులు తీర్చుకున్నారు. అర్చకులు కమలేష్‌శర్మ, లక్ష్మణస్వామి, అనంతయ్య, భాస్కరశర్మలు భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు.

గుర్తుతెలియని వృద్ధుడి మృతి



మృతిచెందిన వృద్ధుడు

దొర్నిపాడు: మండల శివారులోని కేసీ కెనాల్ కుంట వద్ద అమ్మిరెడ్డినగరం వెళ్లే దారిలో శనివారం గుర్తుతెలియని వ్యక్తి మృతి చెందాడు. స్థానికులు అందించిన సమాచారం మేరకు మృతుడు కొంతకాలంగా చుట్టుపక్కల పల్లెల్లో భిక్షాటన చేస్తూ జీవనం సాగిస్తూ ఉండేవాడు. ఆరోగ్యం సరిగ్గా లేకపోవడంతో మృతి చెందినట్లు తెలుస్తోంది. ఏఎస్‌ఐ రంగయ్య ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

ఘనంగా కవలల దినోత్సవం



కవల విద్యార్థులకు అభినందనలు తెలుపుతున్న దృశ్యం

దొర్నిపాడు: మండలంలోని ప్రాథమికోన్నత పాఠశాలలో అంతర్జాతీయ కవలల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా కవలలు 7వ తరగతి చదువుతున్న రేవంత్, రోహిత్‌లకు హెచ్‌ఎం వసంతలక్ష్మి, ఉపాధ్యాయులు, తోటి విద్యార్థులు శుభాకాంక్షలు తెలిపి స్వీట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు కళ్యాణ్, జనార్దన్, ముస్తఫా, జయప్రదమ్మ, మౌనిక పాల్గొన్నారు.

ప్రజలకు మెరుగైన వైద్యసేవలందించాలి



వైద్య విద్యార్థులకు పట్టాలు అందజేస్తున్న దృశ్యం

గోస్పాడు: మానవ సేవయే మాధవ సేవ అనే నినాదంతో గ్రామీణ ప్రాంతాల్లో పేద ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలని శాంతిరాం మెడికల్ కాలేజీ చైర్మన్ డాక్టర్ మిద్దె శాంతిరాముడు అన్నారు. శనివారం స్థానిక శాంతిరాం మెడికల్ కాలేజీ, జనరల్ ఆసుపత్రిలో 14వ గ్రాడ్యుయేషన్ డే కార్యక్రమాన్ని డాక్టర్ ఆంజనేయులు ఆధ్వర్యంలో నిర్వహించారు. కళాశాల ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ మిద్దె రఘురాం, డాక్టర్లు మాధవీలత, రవిబాబు, వసంత్, ఆర్ చవాన్, మధుసూదన్‌రెడ్డి పాల్గొన్నారు.

దుప్పికి గాయాలు



గాయపడిన దుప్పి

మహానంది: చుక్కల దుప్పి శనివారం మహానంది నుంచి ఎంసీ ఫారం వెళ్లే మార్గంలో ఉన్న తెలుగు గంగ కాల్వలో దిగి ప్రమాదవశాత్తూ కిందపడటంతో గాయాలపాలైంది. నందిపల్లెకు చెందిన కొందరు వ్యవసాయ కూలీలు గుర్తించి కాలువలోకి దిగి దుప్పిని రక్షించారు. అటుగా వెళ్తున్న కానిస్టేబుల్ నారాయణస్వామి అటవీశాఖ అధికారులకు సమాచారం అందించారు. ఈ విషయంపై అటవీశాఖ డిప్యూటీ డైరెక్టర్ అనురాగ్ మీనాను ఆరా తీయగా విచారణ చేసి దుప్పికి వైద్యసేవలు అందిస్తామన్నారు.

త్యాగధనులు రేనాటి సూర్యచంద్రులు

నంద్యాల(వ్యవసాయం): రేనాటి సూర్యచంద్రులుగా పేరు గాంచిన ఉయ్యాలవాడ నరసింహారెడ్డి, బుడ్డా వెంగళరెడ్డి త్యాగధనులని వక్తలు కొనియాడారు. శనివారం వివేకానంద ఆడిటోరియంలో మాజీ పార్లమెంట్ సభ్యుడు పోచా బ్రహ్మానందరెడ్డి అధ్యక్షతన సంస్మరణ సభ ఏర్పాటు చేశారు. ముందుగా వారి చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించి జ్యోతి ప్రజ్వలన గావించారు. మాజీ ఎంపీ పోచా మాట్లాడుతూ సూర్యచంద్రుల త్యాగాలను నేటి యువత ఆదర్శంగా తీసుకోవాలన్నారు. రేనాటి సూర్యచంద్రుల చరిత్రను వెలికి తీయటంలో తంగిరాళ్ల వెంకటసుబ్బారావు చేసిన కృషిని చరిత్ర మరిచిపోదన్నారు. కలియుగ దాన కర్ణుడిగా పేరు గాంచిన బుడ్డా వెంగళరెడ్డికి దాతృత్వంలో సాటిలేరన్నారు. మాజీ మున్సిపల్ చైర్‌పర్సన్ దేశం సులోచన మాట్లాడుతూ ప్రథమ స్వాతంత్య్ర సమరబీజం నాటిన ఉయ్యాలవాడ నరసింహారెడ్డి భారత స్వాతంత్య్రోద్యమానికి స్ఫూర్తి దాయకమన్నారు. రాయలసీమలో బానిస సంకెళ్లను తెంచడానికి మండే సూర్యుడిలా ఉయ్యాలడవాడ నరసింహారెడ్డి పోరాటం చేశారన్నారు. కార్యక్రమంలో కల్లూరి రామలింగారెడ్డి, డాక్టర్ రామకృష్ణారెడ్డి, డాక్టర్ రవీంద్రనాథ్, శ్రీనివాసరెడ్డి, చంద్రశేఖర్‌రెడ్డి, శ్రీనిధి రఘువీర్, ఓబులపతి, రఫీ, డాక్టర్ నీలం వెంకటేశ్వర్లు, శేషఫణి, ప్రసాద్, నీలకంఠమాచారి పాల్గొన్నారు.



రేనాటి సూర్యచంద్రుల చిత్రపటాలకు నివాళులర్పిస్తున్న దృశ్యం

విప్లవ వీరుడికి నివాళి



ఉయ్యాలవాడ: ఆంగ్లేయులపై తిరగబడిన తొలి తెలుగు స్వాతంత్య్ర సమరయోధుడు, రేనాటి ముద్దు బిడ్డ ఉయ్యాలవాడ నరసింహారెడ్డి చిరస్మరణీయుడని సర్పంచ్ మేకల ఓబులేస్ కీర్తించారు. శనివారం స్థానిక బస్టాండ్ ఆవరణలో ఏర్పాటు చేసిన ఉయ్యాలవాడ నరసింహారెడ్డి విగ్రహానికి వర్ధంతిని పురస్కరించుకుని పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి జయరామిరెడ్డి, సీనియర్ అసిస్టెంటు మనోహర్‌రెడ్డి, వీఆర్‌ఓ దాదా సాహెబ్ పాల్గొన్నారు.

నరసింహారెడ్డి విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న సర్పంచ్, అధికారులు

యువతకు స్ఫూర్తి ఉయ్యాలవాడ నరసింహారెడ్డి

తొలి స్వాతంత్య్ర సమర యోధుడు రేనాటి వీరుడు ఉయ్యాలవాడ నరసింహారెడ్డిని యువత స్ఫూర్తిగా తీసుకోవాలని ఎంఈఓ శోభావివేకవతి అన్నారు. శనివారం స్థానిక వైపీపీఎం కళాశాలలో ప్రైవేటు పాఠశాలల సంఘం డివిజన్ అధ్యక్షుడు అమీర్‌బాషా ఆధ్వర్యంలో ఉయ్యాలవాడ నరసింహారెడ్డి వర్ధంతిని నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా వచ్చిన ఎంఈఓ శోభావివేకవతి.. నరసింహారెడ్డి చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. –ఆళ్లగడ్డ



ఉయ్యాలవాడ నరసింహారెడ్డి చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న దృశ్యం

24 నుంచి ప్రత్యేక ఆధార్ కేంద్రాలు

దొర్నిపాడు: ఈనెల 24 నుంచి ప్రత్యేక ఆధార్ కేంద్రాలు ఏర్పాటు చేయనున్నట్లు ఎంపీడీఓ సావిత్రి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. 24న కొండాపురం, 25న బుర్రారెడ్డిపల్లె, 27, 28న చాకరాజువేముల గ్రామాల్లో ఆధార్ కేంద్రాలు ఏర్పాటు చేస్తున్నామని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

శాంతియుత వాతావరణంలో పండుగ నిర్వహించుకోవాలి

చాగలమర్రి: మండలంలోని పెద్దవంగలి గ్రామంలో మార్చి 12, 13 తేదీలలో దస్తగిరి స్వామి పండుగను శాంతియుత వాతావరణంలో నిర్వహించుకోవాలని ఆళ్లగడ్డ రూరల్ సీఐ మురళీధర్‌రెడ్డి సూచించారు. ఆయన శనివారం స్థానిక పోలీసు స్టేషన్‌లో దర్గా కమిటీ సభ్యులతో సమావేశమై మాట్లాడారు. అనంతరం ఆయన పెద్దవంగలి గ్రామంలోని దర్గాను సందర్శించారు. ఉరుసు నిర్వహించే ప్రాంతంలో భక్తులకు ఏర్పాటు చేసిన సౌకర్యాలు, అన్నదాన సత్రాన్ని పరిశీలించారు. గతంలో దస్తగిరి స్వామి వారికి భక్తులు హుండీ ద్వారా సమర్పించిన కానుకలు, జమా, ఖర్చుల లెక్కలను చూపాలన్నారు. కొత్తగా కమిటీ ఏర్పాటు చేసి, కమిటీ పేరుతో బ్యాంకు ఖాతాను తెరిచి అందులో కానుకలను జమ చేయాలని సూచించారు.

రైతుల అంగీకారంతోనే భూముల అప్పగింత

ఉయ్యాలవాడ: మండలంలోని మాయలూరు, గోవిందపల్లె గ్రామాల సమీపంలో ఏర్పాటు చేస్తున్న సోలార్ ప్లాంట్ నిర్మాణానికి రైతుల అంగీకారంతోనే భూములు అప్పగించనున్నట్లు నంద్యాల ఆర్‌డీఓ విశ్వనాథ్ తెలిపారు. శనివారం మాయలూరు 71.19 ఎకరాలు, గోవిందపల్లెలో 19.65 ఎకరాల ప్రభుత్వ భూమిని పరిశీలించారు. వంక పోరంబోకు, రస్తా, వాగులు ఉన్న భూమిని కాకుండా మిగిలిన భూములను గుర్తించాలని తహసీల్దార్ శ్రీనివాసులు, సర్వేయర్ విజయలక్ష్మిని ఆదేశించారు. సాగులో ఉన్న రైతుల వివరాలు సేకరించి, గ్రామసభలు ఏర్పాటు చేసి సోలార్ ప్లాంట్‌కు భూములు ఇచ్చేందుకు అంగీకరించే రైతులను గుర్తించాలన్నారు. సోలార్ ప్లాంట్‌కు అప్పగించడం ద్వారా రైతులకు ఏడాదికి రూ.32 వేల చొప్పున యాజమాన్యం ఇస్తుందన్నారు. రైతులపై ప్రభుత్వం నుంచి ఎలాంటి ఒత్తిడి ఉండదన్నారు. అనంతరం స్థానిక రెవెన్యూ కార్యాలయంలో ఏర్పాటు చేసిన వీఆర్‌ఓల సమావేశంలో ఆర్‌డీఓ మాట్లాడుతూ రెవెన్యూ గ్రామసభల ద్వారా వచ్చిన ప్రతి అర్జీకి బాధిత రైతులకు న్యాయం చేయాల్సిన బాధ్యత ఉందన్నారు. ప్రస్తుతం జరుగుతున్న రీ సర్వేను పూర్తి చేయాలని వీఆర్‌ఓలను ఆదేశించారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ ప్రసాద్‌బాబు ఉన్నారు.



మాయలూరు సమీపంలో ప్రభుత్వ భూములు పరిశీలిస్తున్న ఆర్‌డీఓ విశ్వనాథ్

పేదలందరికీ ఇళ్ల స్థలాలు ఇవ్వాలి



మాట్లాడుతున్న ఎంపీపీ శెట్టి ప్రభాకర్

నంద్యాల(అర్బన్): పార్టీలకు అతీతంగా గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అర్హులైన పేదలందరికీ ఇళ్ల స్థలాలు ఇచ్చిందని, ఇంకా స్థలాలు లేని అర్హులను గుర్తించి కూటమి ప్రభుత్వం ఇంటి స్థలాలు ఇవ్వాలని ఎంపీపీ శెట్టి ప్రభాకర్ కోరారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయ ఆవరణలో శనివారం ఎంపీపీ అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. తహసీల్దార్ శ్రీనివాసులు మాట్లాడుతూ అర్హులైన పేదలకు ఇళ్ల స్థలాలు ఇచ్చేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు. గతంలో ఇచ్చిన స్థలాల్లో బేస్‌మెంట్ లెవెల్‌లో ఇంటి నిర్మాణం జరిగిన వాటిని తిరిగి తీసుకునే వీలు లేదన్నారు. విద్యుత్ ఏఈ శ్రీనివాసులు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం రాయితీతో సూర్యఘర్ పథకాన్ని తెచ్చిందని, ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీడీఓ సుగుణశ్రీ, పంచాయతీ కార్యదర్శులు, ఎంపీటీసీలు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

పాఠశాలల ఎకో క్లబ్‌లు స్వచ్ఛ ఆంధ్రలో భాగస్వాములు కావాలి



వైపీపీఎం పాఠశాలను తనిఖీ చేస్తున్న రాష్ట్ర నేషనల్ గ్రీన్ కోర్ సంచాలకులు ప్రవంతి

ఆళ్లగడ్డ: పాఠశాలల్లోని ఎకో క్లబ్‌ల ద్వారా విద్యార్థులు పర్యావరణ పరిరక్షణ ప్రాజెక్టులను చేపట్టడానికి సాధికారత కల్పిస్తాయని రాష్ట్ర నేషనల్ గ్రీన్ కోర్ సంచాలకులు ప్రవంతి అన్నారు. శనివారం స్థానిక వైపీపీఎం ప్రభుత్వ ఉన్నత పాఠశాలను సందర్శించి విద్యార్థులతో ముఖాముఖి నిర్వహించారు. పొరుగు సమాజాలను ప్రభావితం చేయడానికి, పర్యావరణ ప్రవర్తనను ప్రోత్సహించడానికి విద్యార్థులకు ఎకో క్లబ్ మంచి వేదికన్నారు. పాఠశాలలో చెట్ల పెంపకం చేపట్టడం ద్వారా విద్యార్థులు తమ పరిసరాలను పచ్చగా, పరిశుభ్రంగా ఉంచడానికి ప్రేరేపించాలన్నారు. నీటి వినియోగాన్ని ఆప్టిమైజ్ చేయడం ద్వారా నీటి సంరక్షణ తత్వాన్ని ప్రోత్సహించాలన్నారు. ఆమె వెంట జిల్లా గ్రీన్ కోర్ కో ఆర్డినేటర్ చంద్రశేఖర్‌రెడ్డి, ఎంఈఓ శోభావివేకవతి ఉన్నారు.

ఓంకార క్షేత్రాన్ని సందర్శించిన ఏఎస్పీ

బండి ఆత్మకూరు: శివరాత్రి ఉత్సవాల సందర్భంగా ఓంకార క్షేత్రాన్ని ఏఎస్పీ జావలి సందర్శించారు. భక్తుల సౌకర్యార్థం చేపట్టిన ఏర్పాట్లను పరిశీలించారు. భద్రతా చర్యలపై పోలీసులతో చర్చించి పలు సూచనలు చేశారు. ఏఎస్పీ వెంట ఎస్‌ఐ జగన్ మోహన్ ఉన్నారు.



క్రిష్టిపాడులోని కుందూనది ఒడ్డున కమ్ముకున్న మంచు

మండువేసవిలో మంచు దుప్పటి

రోజురోజు ఎండలు తీవ్రమవుతున్నాయి. ఉదయం 7గంటలు దాటిందంటే చాలు భానుడు తన ప్రతాపం చూపుతున్నాడు. కానీ తెల్లవారు జామున చలి తీవ్రంగా ఉండటంతో పాటు మంచు కురుస్తోంది. ఎండల ముదిరినా మంచు కురుస్తుండంతో స్థానికులు ఆశ్చర్యం వ్యక్తం చేస్తున్నారు.
– దొర్నిపాడు

నోటీస్ బోర్డు

6వ తరగతిలో ప్రవేశానికి దరఖాస్తుల ఆహ్వానం

నంద్యాల(న్యూటౌన్): క్రాంతినగర్‌లోని ఏపీ మోడల్ స్కూల్‌లో 2025–26 విద్యాసంవత్సరానికి గాను 6వ తరగతిలో ప్రవేశానికి ఆన్‌లైన్‌లో నమోదు చేసుకొనేందుకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ లక్ష్మీదేవి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆన్‌లైన్‌లో నమోదు చేసుకున్న ధ్రువపత్రాలను పాఠశాలలో అందజేయాలన్నారు. ఈనెల 24 నుంచి మార్చి 31వ తేదీ లోపు ఆసక్తి కలిగిన విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఏప్రిల్ 20వ తేదీన జరిగే ప్రవేశ పరీక్ష 5వ తరగతి స్థాయిలో తెలుగు, ఆంగ్ల మాధ్యమంలో ఉంటుందన్నారు. ఓసీ, బీసీ విద్యార్థులకు రూ.150, ఎస్సీ, ఎస్టీ విద్యార్థులకు రూ.75 దరఖాస్తు రుసుముగా చెల్లించాలని పేర్కొన్నారు.

మోడల్ స్కూల్‌లో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

శిరివెళ్ల: స్థానిక మోడల్ స్కూల్‌లో 2025–26 విద్యాసంవత్సరానికి 6వ తరగతిలో ప్రవేశాలకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ ఇష్రత్‌బేగం శనివారం తెలిపారు. ఈ నెల 25 లోగా ఓసీ, బీసీ విద్యార్థులు రూ. 150, ఎస్సీ, ఎస్టీలు రూ.75 ఫీజు చెల్లించి దరఖాస్తు చేసుకోవాలని, ఏప్రిల్ 20న ప్రవేశ పరీక్ష ఉంటుందని తెలిపారు. మరిన్ని వివరాలకు 9490117206 నంబర్‌ను సంప్రదించాలన్నారు.

శైవ క్షేత్రాలకు మందుల పంపిణీ



మందులు పంపిణీ చేస్తున్న దృశ్యం

నంద్యాల(వ్యవసాయం): ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో జిల్లాలోని శైవ క్షేత్రాల్లో ఏర్పాటు చేసిన వైద్య శిబిరాలకు శనివారం అధ్యక్షుడు దస్తగిరి, వైస్ చైర్మన్ మారుతి ఆధ్వర్యంలో మందులు పంపిణీ చేశారు. వారు మాట్లాడుతూ శ్రీశైల క్షేత్ర పరిధిలోని పెచ్చెరువు, నంది మండపం, కైలాస ద్వారంతో పాటు మహానంది, ఓంకారం, భోగేశ్వరం, యాగంటి, డోన్, బుగ్గరామేశ్వరం పుణ్యక్షేత్రాల్లో వైద్య శిబిరాలకు మందులు అందజేశామని చెప్పారు. శ్రీశైలంలో మొబైల్ హెల్త్ వ్యాన్‌లు అందుబాటులో ఉంచామన్నారు. వైద్య శిబిరాల్లో రెడ్ క్రాస్ సభ్యులతో పాటు ప్రభుత్వ , ఆర్‌అండ్‌బీ వైద్యులు మూడు రోజుల పాటు ఉచిత వైద్య సేవలందించి మందులను ఉచితంగా అందజేస్తారన్నారు. సభ్యులు ఉస్మాన్‌బాషా, నాగేశ్వరరావు, సైఫుల్లా, శ్రీనివాసులు, షరీఫ్ పాల్గొన్నారు.



కేజీబీవీ ప్రాంగణంలో పూజలు చేస్తున్న గ్రామస్తులు

రుద్రవరం చేరిన పార్వేట పల్లకీ

పార్వేట ఉత్సవాల్లో భాగంగా ఉత్సవమూర్తులు జ్వాలా నరసింహస్వామి, ప్రహ్లాదవరదస్వామి పల్లకీ శనివారం రాత్రి తువ్వపల్లె నుంచి రుద్రవరానికి చేరుకుంది. స్వామి వారి పల్లకీ గ్రామ శివారులోని కేజీబీవీ వద్దకు చేరుకోగా గ్రామ పెద్దలు, వివిధ శాఖల అధికారులు మేళ తాళాలతో ఎదురేగి ప్రత్యేక పూజలు చేసి స్వాగతించారు. – రుద్రవరం

చెత్త నుంచి సంపద తయారు చేయాలి

గోస్పాడు: గ్రామాల్లో చెత్త నుంచి సంపద తయారయ్యేలా చూడాలని డీపీఓ జమీవుల్లా సూచించారు. శనివారం జిల్లాలోని గ్రామ పంచాయతీల పరిధిలో చెత్త సేకరణపై ప్రత్యేక డ్రైవ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈనెల 22, 23 తేదీల్లో జిల్లాలోని 489 గ్రామాల్లో చెత్త సేకరణపై ప్రత్యేక డ్రైవ్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అందులో భాగంగా ఆయా గ్రామాల్లో ఉదయం నుంచే సంబంధిత పంచాయతీ కార్యదర్శి ఆధ్వర్యంలో పారిశుద్ధ్య సిబ్బంది హరిత రాయబరులతో ప్రతి ఇంటి నుంచి చెత్త సేకరణ జరిగేలా చర్యలు తీసుకోనున్నట్లు చెప్పారు. గ్రామాల్లో రోడ్లకు ఇరువైపులా ఉన్న చెత్త కుప్పలు, పేడ దిబ్బలను తొలగించేలా సిబ్బంది చర్యలు చేపట్టాలన్నారు. వాటిని చెత్త సంపద కేంద్రాలకు తరలించాలని తెలిపారు.



కొలూరులో ఇంటింటికీ తిరిగి చెత్త సేకరిస్తున్న దృశ్యం

రెండు గ్రామాల్లో పశువైద్యశిబిరాలు



రైతులకు మందులు పంపిణీ చేస్తున్న దృశ్యం

రుద్రవరం: మండల పరిధిలోని పెద్దకంబలూరు, చిన్నకంబలూరు గ్రామాల్లో శనివారం అటవీశాఖ ఆధ్వర్యంలో అధికారులు పశువైద్యశిబిరాలు నిర్వహించారు. చెలిమ రేంజ్ అధికారి ఉదయ్‌దీప్, పెద్దకంబలూరు సెక్షన్ అధికారి కిషోర్‌కుమార్, ఎఫ్‌బీఓలు రామారావు, నాగప్ప ఆధ్వర్యంలో ఎర్రగుడిదిన్నె పశు వైద్యాధికారి మనోరంజన్ ప్రతాప్ రెండు గ్రామాల్లో శిబిరాలు నిర్వహించి పశువులకు వైద్యం చేశారు. 1,850 పశువులకు గాలికుంటు నివారణ టీకాలు, 56 పశువులకు సాధారణ పరీక్షలు, 12 వాటికి గర్భధారణ పరీక్షలు నిర్వహించారు. లేగదూడులకు ఇతర పశువులకు సంబంధించిన రైతులకు మందులను ఉచితంగా అందించారు. కార్యక్రమంలో జేవీఓ దుర్గాప్రసాదు ఉన్నారు.





అలరించిన నృత్య ఉత్సవాలు

శ్రీశైలం: శ్రీశైలంలో మల్లికార్జున భ్రమరాంబికా దేవి బ్రహ్మోత్సవాల్లో భాగంగా శనివారం కళారాధనలో శ్రీశైల దేవస్థానం, నంద్యాల శ్రీసాయి నాట్యాంజలి ఫైన్ ఆర్ట్స్ డెవలప్‌మెంట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన జాతీయ మహాశివరాత్రి నృత్య ఉత్సవాలు అలరించాయి. అంతకుముందు దేవస్థాన ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ ఎం శ్రీనివాసరావు, పబ్లిక్ రిలేషన్స్ అధికారి టి శ్రీనివాసులు, ఫెస్టివల్ డైరెక్టర్ డాక్టర్ పల్లంశెట్టి సురేష్ తదితరులు ఉత్సవాలను ప్రారంభించారు.

ఏపీ ప్రైవేటు స్కూల్స్ అసోసియేషన్ కమిటీ ఎన్నిక



జిల్లా, పట్టణ అధ్యక్షులుగా రవీంద్రనాథ్, బాలచంద్రుడు

నంద్యాల(న్యూటౌన్): ఏపీ ప్రైవేటు స్కూల్స్ అసోసియేషన్ (ఆప్సా) జిల్లా నంద్యాల పట్టణ కమిటీని ఎన్నుకున్నట్లు రాయలసీమ జోనల్ ఆప్సా అధ్యక్షుడు దండె దస్తగిరి తెలిపారు. రాయలసీమ రీజియన్ ఆంధ్రప్రదేశ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో శనివారం పట్టణంలోని బాల చంద్ర సమతా స్కూల్‌లో ప్రైవేటు స్కూల్ కరస్పాండెంట్ జిల్లా నూతన కమిటీ, పట్టణ కమిటీలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఎన్నికల కమిటీ పరిశీలకుడిగా కో ఆప్షన్ మెంబర్ పడకండ్ల సుబ్రహ్మణ్యం వ్యవహరించారు. ఆంధ్రప్రదేశ్ ప్రైవేటు స్కూల్స్ అసోసియేషన్ జిల్లా గౌరవాధ్యక్షుడిగా బత్తిన వెంకటేశ్వర్లు, అధ్యక్షుడిగా ఎం.జీవీ రవీంద్రనాథ్, కార్యదర్శి వాసుదేవరెడ్డి, కోశాధికారిగా హరీఫ్, ఉపాధ్యక్షులుగా నాగరాజరావు, సహాయ కార్యదర్శిగా రాజనాల సుధాకర్‌ను ఎన్నుకున్నారు. అలాగే పట్టణ గౌరవాధ్యక్షులుగా ఎస్.రసూల్ ఆజాద్, అధ్యక్షుడిగా సమతా బాలచంద్రుడు, కార్యదర్శిగా శ్రీనివాసపాండే, కోశాధికారిగా న్యామతుల్లా, ఉపాధ్యక్షుడిగా టైటాస్ విజయ్‌కుమార్, సహాయ కార్యదర్శిగా శ్రీనివాసులును ఎన్నుకున్నారు.